బుధవారం 15-5-2024

# ముందడుగు

సంపుటి: 1, సంచిక: 335, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

దినపత్రిక

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com

# నామినేషన్ దాఖలు చేసిన మోడీ

## వరుసగా మూడోసారి వారణాశి నుంచి పోటీ ▪ మోడీ వెంట కీలక ఎన్డీఏ నేతలు హాజరు

**ముందడుగు వారణాసి:**

ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం తన సిట్టింగ్ నియోజకవర్గం వారణాసి నుంచి నామినేషన్ వేశారు. మోడీ వెంట కీలక ఎన్డీఏ నేతలు వెంటరాగా మంగళవారం ఉదయం జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ స్థానం నుంచి ప్రధాని వరుసగా మూడోసారి పోటీ చేస్తున్నారు. నామినేషన్ కార్యక్రమంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తదితరులు మోడీ వెంట రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చారు. ముందుగా కాశీలోని దశాశ్వమేధ ఘాట్ వద్ద ప్రధాని పూజలు నిర్వహించారు. అక్కడే క్రూజ్ షిప్‌లో పర్యటించారు. కాలభైరవ ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం యోగితో కలిసి మోడీ.. ఆరు కిలోమీటర్ల మేర భారీ రోడ్‌షో నిర్వహించారు. అనంతరం కాశీ విశ్వనాథుడి ఆలయంలో పూజలు చేశారు. రాత్రి ఇక్కడే బస చేశారు. నామినేషన్ నిమిత్తం మోడీ పర్యటన ఏర్పాట్లను హోంశాఖ మంత్రి అమిత్‌షా, సీఎం యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షించారు. ఆ పార్టీ సీనియర్ నేత సునీల్ బన్సల్ చాలా రోజుల నుంచి వారణాసిలో ఉండి పనులను చక్కబెట్టారు. మంగళవారం ఉదయం మోదీ 'ఎక్స్' వేదికగా ఒక ఎమోషనల్ వీడియోను షేర్ చేశారు. కాశీతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు.



## శ్రీనగర్‌లో అత్యధికంగా పోలింగ్ నమోదు

### 26 ఏండ్ల తర్వాత 36.58 శాతం ఓటింగ్



**ముందడుగు శ్రీనగర్:**

26 ఏండ్ల తర్వాత శ్రీనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైంది. నిన్న రాత్రి 8 గంటల వరకు 36.58 శాతం పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ స్థాయిలో పోలింగ్ నమోదు కావడం 1998 తర్వాత ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. శ్రీనగర్ పార్లమెంట్ స్థానానికి 24 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి 12 మంది పోటీ చేశారు. చదూరా, చాహ్ ఐ షరీఫ్, గందర్బల్, కంగన్, ఖాన్‌సాహిబ్, సోఫియాన్ అసెంబ్లీ నియోజకవర్గంలో మిగతా 2లో

## కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

### మే 20 వరకు పొడిగించిన ప్రత్యేక కోర్టు

**ముందడుగు ఢిల్లీ:**

ఢిల్లీ లిక్కర్ కేసులో భారాస ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని మే 20 వరకు రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు పొడిగించింది. ఈడీ కేసులో రిమాండ్ ముగియడంతో కవితను మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా తిహాడ్ జైలు నుంచి హాజరు పర్చారు. దర్యాప్తు కొనసాగుతున్నందున రిమాండ్ పొడిగించాలని ఈడీ మిగతా 2లో




## ప్రజలు భారాసకు మద్దతుగా నిలిచారు

**ముందడుగు సిరిసిల్ల:**


బిఆర్ఎస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంత ప్రజలు మద్దతుగా నిలిచారని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. రైతు భరోసా వేయనందుకు రైతులు కాంగ్రెస్‌పై ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. సిరిసిల్లలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ''అనేక హామీలు ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. నెలకు రూ. 2500 ఇవ్వలేదని కాంగ్రెస్‌పై మహిళలు కోపంతో మిగతా 2లో





## భారత్ సరిహద్దుల్లో పాక్ డ్రోన్ల కలకలం!

వివరాలు 2లో



## మాంసాహారం కంటే శాకాహారం ధర ఎక్కువ

వివరాలు 3లో



## బ్లాక్ రైస్ గుండె ఆరోగ్యానికి మేలు

వివరాలు 4లో

ముందడుగు
బుధవారం, 15-5-2024, హైదరాబాద్

### శ్రీనగర్‌లో అత్యధికంగా
# పోలింగ్ నమోదు

మొదటిపేజీ తరువాయి

45 శాతం కంటే ఎక్కువ పోలింగ్ నమోదైంది. బుద్గాం, గందర్బల్, పుల్వామా, సోఫియాన్ నియోజకవర్గాల్లో ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోలేదు. చివరిసారి 1996లో 40.94 శాతం పోలింగ్ నమోదు కాగా, మళ్లీ ఇప్పుడు 36.58 శాతం పోలింగ్ నమోదైంది. 1998లో 30.06 శాతం, 1999లో 11.93 శాతం, 2004లో 18.57 శాతం, 2009లో 25.55 శాతం, 2014లో 25.86 శాతం, 2019లో 14.43 శాతం పోలింగ్ నమోదైంది.

## కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

మొదటిపేజీ తరువాయి

అధికారులు కోర్టును కోరారు. దర్యాప్తు సంస్థ విజ్ఞప్తి మేరకు కస్టడీని ఈనెల 20వరకు పొడిగించింది. ఎనిమిది వేల పేజీలతో సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసినట్లు ఈడీ.. కోర్టు దృష్టికి తీసుకువచ్చింది. ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై ఈనెల 20న విచారణ చేస్తామని న్యాయస్థానం తెలిపింది.

# ప్రజలు భారాసకు మద్దతుగా నిలిచారు

మొదటిపేజీ తరువాయి

ఉన్నారు. బిజెపిపై కూడా ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది. పెట్రోల్, నిత్యావసరాల ధరలు పెంచారని మోదీపై కోపంతో ఉన్నారు. రెండు జాతీయ పార్టీలకు భారాస ముచ్చెమటలు పట్టించింది. మూడు పార్టీల్లో మా పార్టీకే అధిక ఎంపీ సీట్లు వస్తాయి. దిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లుగా భాజపాకాంగ్రెస్ వైఖరి ఉంది. ఆరేడు సీట్లలో డమ్మీ అభ్యర్థులను పెట్టి భాజపాకు సహకరించారు. కేంద్రంలోనూ ఏ కూటమికి స్పష్టమైన ఆధిక్యం వచ్చే పరిస్థితి లేదు. ప్రాంతీయ పార్టీలతో ఏర్పడే కూటమిదే కేంద్రంలో అధికారం' అని కేటీఆర్ అన్నారు

# బీజేపీ గ్రాఫ్ పతనమవుతోంది

- రేషన్ పేరుతో బీజేపీ దగా
- బీజేపీ పట్ల జనాగ్రహం పెల్లుబుకుతుంది
- ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ స్పష్టం

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**



బీజేపీ గ్రాఫ్ పతనమవుతోందని, బుందేల్‌ఖండ్‌లో ఆ పార్టీ పరిస్థితి దిగజారిందని ఎస్పీ చీఫ్, ఆ పార్టీ కన్నౌజ్ ఎంపీ అభ్యర్థి అఖిలేష్ యాదవ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ అహంకారానికి చరమగీతం పాడనున్నారని చెప్పారు.బీజేపీ పట్ల జనాగ్రహం పెల్లుబుకుతున్నదని అన్నారు. రైతులకు నీటి సరఫరా కోసం కాషాయ పాలకులు ఎలాంటి ఏర్పాట్లూ చేయలేదని, పంట కొనుగోళ్లకు సరైన వ్యవస్థ నెలకొల్పలేదని దుయ్యబట్టారు. రేషన్ పేరుతో ప్రజలను బీజేపీ దగా చేస్తోందని మండిపడ్డారు. బుందేల్ ఖండ్ ప్రజలు తమకు ఎవరు శత్రువుల్లో గుర్తెరిగారని చెప్పారు.యూపీ ప్రజలు ఎస్పీతో పాటు విపక్ష ఇండియా కూటమి పక్షాన ఉన్నారని, దేశంలో 140 కోట్ల మంది ప్రజలు బీజేపీని 140 సీట్లకు పరిమితం చేస్తారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మన్ కీ బాత్ వినాలని ఇప్పుడు ఎవరూ కోరుకోవడం లేదని, వారు రాజ్యాంగం గురించి వినాలని కోరుకుంటున్నారని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ స్పష్టం చేశారు.

# భారత్ సరిహద్దుల్లో పాక్ డ్రోన్ల కలకలం!

## 60 రోజుల్లో 49 డ్రోన్లు కూల్చివేత ▪ చాలావరకు డ్రోన్లు చైనాలో తయారైనవే

**ముందడుగు జాతీయం:**

దేశంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 60 రోజుల వ్యవధిలో సరిహద్దు భద్రతాదళం.. 49 డ్రోన్లను కూల్చివేసింది. 2022 జనవరి మే మధ్యకాలంతో పోలిస్తే ఈ ఏడాది అదే వ్యవధిలో దాదాపు 13 రెట్లు ఎక్కువ డ్రోన్లు పొరుగు దేశం నుంచి భారత భూభాగాల్లోకి చొరబడుతూ పట్టుబడ్డాయి. వాటిలో చాలావరకు చైనాలో తయారైనవే కావడం గమనార్హం.



లోక్‌సభ పోలింగ్ తేదీల ప్రకటనతో దేశంలో మార్చి 16న ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. ఆ రోజు నుంచి ఇప్పటివరకు వెలుగుచూసిన డ్రోన్లు కూలిన ఘటనల్లో అత్యధికంగా 47 పంజాబ్‌లోనే నమోదయ్యాయి. 13 లోక్‌సభ స్థానాలున్న ఈ రాష్ట్రంలో చివరివిడతలో భాగంగా జూన్ 1న పోలింగ్ నిర్వహించనున్నారు. మరో రెండు డ్రోన్లు.. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్, బికనీర్ సెక్టార్లలో పట్టుబడ్డాయి. అధికారిక గణాంకాల ప్రకారం 2022లో జనవరి మే 14 మధ్యకాలంలో ఆరు డ్రోన్లు పట్టుబడగా.. 2023లో అదే వ్యవధిలో ఈ సంఖ్య 14కు చేరుకుంది. 2024లో 75కి పెరిగింది. 2022లో 22, 2023లో 119 డ్రోన్లను కూల్చివేశారు. పాకిస్థాన్ వెంబడి అంతర్జాతీయ సరిహద్దు నుంచి డ్రోన్ల అక్రమ చొరబాట్లు పెరగడం కలవరం రేపుతోంది. మాదక ద్రవ్యాలు, ఆయుధాల అక్రమ రవాణాకు వినియోగించే డ్రోన్ల కదలికలతో ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలగకుండా నివారించేందుకు అదనపు నిఘా చేపట్టాలని 'ఈసీ' ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు బీఎస్ఎఫ్‌తోపాటు పంజాబ్, రాజస్థాన్ పోలీసులు, వివిధ విభాగాలు డ్రోన్ల కట్టడిపై దృష్టి సారించాయి'' అని ఓ సీనియర్ బీఎస్ఎఫ్ అధికారి తెలిపారు. నిఘా సమాచారం, సాంకేతిక పరికరాల సాయంతో వాటికి అడ్డుకట్ట వేస్తున్నట్లు చెప్పారు. సరిహద్దులో భద్రత ముప్పును కలిగించే ఈ అక్రమ డ్రోన్ల చొరబాట్లు ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదని కేంద్ర హోంశాఖ అధికారి ఒకరు తెలిపారు. అయితే.. భద్రతా సిబ్బందికి వాటిని కట్టడి చేసే సామర్థ్యం మెరుగైందన్నారు.

### అంకితకు ₹5లక్షల చెక్కు ఇచ్చిన
# డీకే శివకుమార్

## పదిలో 625/625 మార్కులు సాధించిన అంకిత



**ముందడుగు కర్ణాటక:**

625/625 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకుతో మెరిసిన బాగల్‌కోట్ జిల్లా ముధోల్‌కు చెందిన అంకిత బసప్పను డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె తదుపరి చదువు కోసం రూ.5 లక్షల చెక్కును అందజేశారు. మరో ర్యాంకర్, మాండ్యకు చెందిన నవనీత్ అనే బాలుడిని సన్మానించి రూ.2 లక్షలు ఇచ్చారు. కర్ణాటకలో ఇటీవల విడుదలైన ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల ఫలితాల్లో అసమాన ప్రతిభ చాటిన పలువురు విద్యార్థులను డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సన్మానించారు.


ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అంకిత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను డీకేఎస్ అభినందించారు. మిగతా పిల్లలు కూడా ఇలాగే చదివి తమ పాఠశాలలకు, గురువులు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఈ సందర్భంగా సూచించారు. పదో తరగతి ఫలితాల్లో 100శాతం మార్కులు సాధించిన అంకితను సీఎం సిద్ధరామయ్యతో పాటు పలువురు ఉన్నతాధికారులు సైతం ప్రశంసించారు.

# దేశంలో తీవ్రమైన ఆర్థిక సమస్యలు

- ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరిస్తాం
- పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

**ముందడుగు పాకిస్తాన్:**

దేశంలో తీవ్రమైన ఆర్థిక సమస్యల నుంచి బయటపడేయటానికి, దేశంలోని వ్యూహాత్మక కంపెనీలు మినహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలపై సమావేశం నిర్వహించిన అనంతరం ఈ ప్రకటన చేశారు. సోమవారం ఐఎంఎఫ్‌తో దీర్ఘకాలం సాయంపై చర్చించిన అనంతరం ప్రైవేటీకరణ దశగా ప్రధాని నిర్ణయం వెలువడటం గమనార్హం. ఇప్పటి వరకు తీవ్ర నష్టాల్లో ఉన్న సంస్థలు మాత్రమే పాక్ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. ఇక ఐఎంఎఫ్ సుదీర్ఘ కాలంగా ఆ దేశాన్ని ప్రైవేటీకరణ దిశగా నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి చేస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రధాని కార్యాలయం నుంచి కీలక ప్రకటన వెలువడింది.



'' లా భా ల్లో ఉన్నా.. నష్టాల్లో ఉన్నా సరే ప్రభుత్వ రంగ కంపెనీలు మొత్తాన్ని ప్రైవేటీకరిస్తాం'' అని దానిలో పేర్కొన్నారు. ఇప్పటికే పాక్ అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ సంస్థ విక్రయ ప్రక్రియను వేగవంతం చేసింది. గత నెలాఖరులో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాక్‌కు మరో 1.1 బిలియన్ డాలర్ల రుణాన్ని ఇచ్చేందుకు అంతర్జాతీయ ద్రవ్య నిధి ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోద ముద్ర వేసింది. 3 బిలియన్ డాలర్ల ప్యాకేజీపై పాకిస్థాన్, ఐఎంఎఫ్ మధ్య జరిగిన ఒప్పందం ఏప్రిల్‌తో ముగిసింది. ఈ క్రమంలోనే చివరి విడతగా రుణాన్ని మంజూరుచేసేందుకు అంగీకారం లభించింది.


ముందడుగు
బుధవారం, 15-5-2024, హైదరాబాద్

# 110 రోజుల్లో 200 విమానాల్లో ప్రయాణించాడు

## ఎందుకంటే విమానాల్లో దొంగతనాల కోసం

**ముందడుగు జాతీయం:**

ఒక వ్యక్తి 110 రోజుల్లో 200 విమానాల్లో ప్రయాణించి విలువైన ఆభరణాలు, నగదు దొంగతనం చేశాడు. ఏప్రిల్ 11వ తేదీన రూ. 7 లక్షల విలువ చేసే ఆభరణాలు విమానంలో మాయమైనట్లు ఓ మహిళా ప్రయాణికురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత మహిళ హైదరాబాద్ నుంచి ఢిల్లీకి ప్రయాణించారు. ఫిబ్రవరి 2వ తేదీన మరో ప్యాసింజర్ నుంచి రూ. 20 లక్షల విలువ చేసే ఆభరణాలు, ఇతర వస్తువులను దొంగిలించారు. ఇతను అమృత్‌సర్ నుంచి ఢిల్లీకి ప్రయాణించాడు. బాధిత ప్రయాణికుడు కూడా పోలీసులకు పిర్యాదు చేశాడు. ఇతర విమానాశ్రయాల్లోనూ దొంగతనం కేసులు నమోదు అయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఢిల్లీ, అమృత్‌సర్, హైదరాబాద్ ఎయిర్‌పోర్టుల్లో ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తి ఫోన్ నంబర్‌ను పోలీసులు ఛేధించారు. అనంతరం అతన్ని ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు.



విమానాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని రాజేశ్ కపూర్(40)గా పోలీసులు గుర్తించారు. అతను ఎయిర్‌పోర్టుల్లో తిరుగుతూ వృద్ధులను టార్గెట్ చేసేవాడు. వారిని అనుసరిస్తూ ఎంట్రీ పాయింట్ వద్ద వారితో మాట కలిపేవాడు. వారు తీసుకెళ్తున్న లగేజీలో ఏయే వస్తువులు ఉన్నాయో కనుగొనేవాడు. దాంతో వారితో పాటు విమానం ఎక్కేవాడు. ఇక విమానంలో వారి సీటు పక్కనే కూర్చొనేందుకు సిబ్బందితో మాట్లాడి ఒప్పించేవాడు. ఆ తర్వాత మెల్లగా వారి బ్యాగుల్లోని విలువైన ఆభరణాలు, నగదును కొట్టేసేవాడు. ఢిల్లీ పహార్‌గంజ్‌లో రిక్కీ డీలక్స్ పేరిట రాజేశ్‌కు సొంత గెస్ట్ హౌజ్ ఉంది. దాంట్లోనే అతడు మూడో అంతస్తులో నివాసముండేవాడు. ఒకప్పుడు మనీ ఎక్స్ఛేంజ్ బిజినెస్‌తో పాటు మొబైల్ రిపేర్ షాపును నడిపేవాడు. ఆ ఇంట్లోనే పోలీసులు పెద్ద ఎత్తున బంగారం, వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని వస్తువులను పక్క వీధిలో ఉండే నగల వ్యాపారికి విక్రయించినట్లు పోలీసుల విచారణలో తేలింది.



# రాజకీయాల్లోనూ సత్తా చాటతా

## నామినేషన్ దాఖలు చేసిన బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

మండి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ నామినేషన్ దాఖలు చేశారు. మండి ప్రజల ప్రేమానురాగాలే తనను ఇక్కడికి రప్పించాయని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. కంగనా వెంట ఆమె తల్లి, సోదరి ఉన్నారు. సినిమాల్లో రాణించిన తరహాలోనే రాజకీయాలపైనా తనదైన ముద్ర వేస్తానని కంగనా రనౌత్ ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో అన్ని రంగాల్లో మహిళలు సత్తా చాటుతున్నారని, మండి మహిళలు సైన్యం, విద్యా, రాజకీయాల్లో రాణిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశ వ్యతిరేక వైఖరితో ముందుకెళ్లడం ఆందోళన రేకెత్తిస్తోందని చెప్పారు.ఇక కంగనాకు మద్దతుగా ప్రజలు తరలివస్తున్నారని, ఇక్కడ తమ విజయం ఖాయమని నటి తల్లి ఆశా రనౌత్ ఆశాభావం వ్యక్తం చేశారు. కంగనా నూతన ప్రస్థానం సందర్భంగా తాను శుభాకాంక్షలు తెలుపుతున్నానని నామినేషన్ కార్యక్రమానికి హాజరైన ఆమె సోదరి రంగోలి రనౌత్ పేర్కొన్నారు.కంగనా విజయాన్ని ఇక్కడకు హాజరైన భారీ జనసందోహమే వెల్లడిస్తోందని ధీమా వ్యక్తం చేశారు.

# రాష్ట్రంలో 65.67శాతానికి పోలింగ్..

- అత్యధికంగా భువనగిరిలో 76.78శాతం పోలింగ్
- అత్యల్పంగా హైదరాబాద్‌లో 48.48శాతం
- జూన్ 4న 34 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు
- వెల్లడించిన సీఈవో వికాస్‌రాజ్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



తెలంగాణలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ శాతం 65.67శాతానికి పెరిగింది. తుది పోలింగ్ వివరాలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ వెల్లడించారు. అత్యధికంగా భువనగిరిలో 76.78శాతం పోలింగ్ నమోదైందని.. అత్యల్పంగా హైదరాబాద్‌లో 48.48శాతం నమోదైనట్లు ప్రకటించారు. నర్సాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 84.25శాతం, మలక్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యల్పంగా 42.76శాతం నమోదైందని చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే 3శాతం పోలింగ్ పెరిగిందన్నారు. జూన్ 4న 34 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్‌లో 47.03శాతం, చేవెళ్లలో 56.40, కరీంనగర్‌లో 72.54, ఖమ్మంలో 76.09శాతం, మహబూబాబాద్‌లో 72.43శాతం, మల్కాజ్‌గిరిలో 50.78శాతం, మెదక్‌లో 75.09శాతం, నాగర్ కర్నూల్‌లో 69.46శాతం, నల్గొండలో 74.02శాతం, నిజామాబాద్‌లో 71.92శాతం, పెద్దపల్లిలో 67.87శాతం, సికింద్రాబాద్‌లో 49.04శాతం, వరంగల్‌లో 68.86శాతం, జహీరాబాద్‌లో 74.63శాతం పోలింగ్ నమోదైందని సీఈవో వికాస్ రాజ్ వివరించారు. ఇక కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో 51.61శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించారు.

# మాంసాహారం కంటే శాకాహారం ధర ఎక్కువ

## నాన్ వెజ్ తగ్గింది.. వెజ్ థాలీ ధర పెరిగింది.. ▪ రోటీ రైస్ రేట్ నివేదికలో వెల్లడి

**ముందడుగు జాతీయం:**

ప్రస్తుత రోజుల్లో మాంసాహారం కంటే శాకాహారం ధర రోజురోజుకూ ప్రియమవుతోంది. అదే సమయంలో నాన్ వెజ్ ధర తగ్గుతోంది. ఏప్రిల్ నెలలో వెజిటేరియన్ (శాకాహార) థాలీ సగటు ధర సుమారు 8% పెరగ్గా.. మాంసాహార థాలీ ధర తగ్గింది. క్రిసిల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ అండ్ అనాలసిస్ తాజాగా వెలువరించిన 'రోటీ రైస్ రేట్' నివేదికలో ఈ విషయం వెల్లడైంది. రోటీ, కూరగాయలు (టమటాలు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు), అన్నం, పప్పు, పెరుగు, సలాడ్‌తో కూడిన వెజ్ థాలీ సగటు ధర గతేడాది(2023) ఏప్రిల్‌లో రూ.25.4 ఉండగా.. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.27.4కు చేరింది. ఈ ఏడాది మార్చి నాటి రూ.27.3తో పోల్చినా స్వల్పంగా పెరిగింది. అదే నాన్ వెజ్ థాలీలో పప్పు స్థానంలో చికెన్ ఉంటుంది. 2023 ఏప్రిల్‌లో సగటు ధర రూ.58.9 ఉండగా, గత నెలలో రూ.56.3 ఉంది. ఈ ఏడాది మార్చి నాటికి ఉన్న ధర రూ.54.9తో పోలిస్తే మాత్రం ఏప్రిల్‌లో ధర పెరిగింది.



### వెజ్ థాలీకి పెరుగుతున్న ఖర్చు

సాధారణంగా థాలీని తయారుచేయడానికి వినియోగించే సరకుల ధరల సగటు ఆధారంగా దానికయ్యే ఖర్చును నిర్ణయిస్తారు. దాని ఆధారంగా సామాన్యుడిపై ఎంత భారం పడుతోందన్నది అంచనా వేస్తారు. అయితే, వెజ్ థాలీలో వినియోగించే ఉల్లిపాయల ధర 41%, టమాటాలు 40%, బంగాళాదుంపలు 38%, బియ్యం 14%, పప్పులు 20% గతంతో పోలిస్తే ప్రియమయ్యాయి. జీలకర్ర, మిరప, వంటనూనెల ధర వరుసగా 40%, 31%, 10% తగ్గుముఖం పట్టాయి. దీనివల్ల వెజ్ థాలీ ధర మరీ ఎక్కువగా పెరగలేదు.

### నాన్ వెజ్ థాలీ విషయానికొస్తే..

దీని ధరలో 50 శాతం వెయిటేజీ బ్రాయిలర్‌దే. వార్షిక ప్రాతిపదికన బ్రాయిలర్ ధర 12% తగ్గడంతో నాన్‌వెజ్ థాలీ ధర తగ్గింది. ఈ మధ్య కాలంలో బ్రాయిలర్ ధర 4% పెరగడంతో ఈ ఏడాది మార్చి కంటే ఏప్రిల్‌లో నాన్‌వెజ్ థాలీ ధర 3% పెరిగిందని నివేదిక తెలిపింది. ''గతేడాదితో పోలిస్తే వెజ్ థాలీ ధర పెరగ్గా.. నాన్ వెజ్ థాలీ తగ్గింది. బ్రాయిలర్ ధర తగ్గడం మూలంగా నాన్ వెజ్ తగ్గగా.. ఉల్లిపాయలు, దుంపలు, టమాటా ధరలు పెరిగాయి. భవిష్యత్‌లో కూరగాయల ధరలు స్థిరంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాం'' అని క్రిసిల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ పుషన్ శర్మ తెలిపారు.

ముందడుగు
బుధవారం, 15-5-2024, హైదరాబాద్

# రైలు ప్రయాణంలో మీ ఫోన్ పోయిందా.. నో టెన్షన్!

## వెంటనే ఈ పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి



**ముందడుగు జాతీయం:**

రైలులో ప్రయాణించేటప్పుడు అనుకోకుండా మీ ఫోన్ పొరపాటున పోగొట్టుకున్నా లేదా దొంగిలించబడినా, దాన్ని తిరిగి పొందడం దాదాపు అసాధ్యం అనిపిస్తుంది. కానీ ఇప్పుడు మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రైలులో మీ పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి పొందేందుకు భారతీయ రైల్వే సంచార్ సతి పోర్టల్‌తో చేతులు కలిపింది. దీని సహాయంతో ప్రజలు ప్రయాణించేటప్పుడు పోగొట్టుకున్న ఫోన్‌లను తిరిగి పొందడం చాలా సులభం అవుతుంది.

### పోగొట్టుకున్న ఫోన్ గురించి ఇక్కడ ఫిర్యాదు చేయండి

ప్రజల ప్రయాణానికి, వారి భద్రతకు సాధికారత కల్పించేందుకు టెలికమ్యూనికేషన్స్ విభాగం భారతీయ రైల్వేతో చేతులు కలిపిందని టెలికాం డిపార్ట్‌మెంట్ తెలిపింది. ఇందులో రైలులో ప్రయాణిస్తున్నప్పుడు మీరు పోగొట్టుకున్న లేదా దొంగిలించిన ఫోన్‌ని ఇప్పుడు సంచార్ సతి పోర్టల్‌లో నివేదించవచ్చు. గత వారం నివేదించబడిన 25 ఫోన్‌లలో 10 రికవరీ అయినట్లు డిపార్ట్‌మెంట్ తెలిపింది.

### కమ్యూనికేషన్ భాగస్వామి ఎక్కడ ఉపయోగపడుతుంది?

మొబైల్ ఫోన్ పోయినా లేదా దొంగిలించబడినా, దానిని ఎలా బ్లాక్ చేయడం.. ట్రాక్ చేయడం.. ట్రేస్ చేయడం వంటివి చేయవచ్చు. ఇది దాని డేటాను, వ్యక్తిగత విషయాలను సురక్షితంగా ఉంచడంలో సహాయపడుతుంది.

### సంచార్ సతి పోర్టల్ అంటే ఏమిటి..?

టెలికాం మంత్రి అశ్విని వైష్ణవ్ గత ఏడాది మేలో సంచార్ సతి పోర్టల్‌ను ప్రారంభించారు. సంచార్ సాథీ సహాయంతో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగతనానికి గురైనా, దాన్ని ఎలా బ్లాక్ చేయవచ్చు, ట్రాక్ చేయడం.. ట్రేస్ చేయడం వంటివి చేసువచ్చు. ఇది అతని డేటా, వ్యక్తిగత విషయాలను సురక్షితంగా ఉంచడంలో సహాయపడుతుంది. సదరు వ్యక్తి సిమ్ కార్డుతో పాటు ఫోన్‌ను కూడా బ్లాక్ చేయవచ్చు. సంచార్ సతి పోర్టల్‌ను ఉపయోగించి ఇప్పటివరకు 40 లక్షలకు పైగా మోసపూరిత కనెక్షన్‌లను గుర్తించారు.

# బ్లాక్ రైస్ గుండె ఆరోగ్యానికి మేలు

- ఆరోగ్య ప్రయోజనాలతో కూడిన సూపర్ ఫుడ్
- బ్లాక్ రైస్‌కు వాటర్ ఓట్స్ అని పేరు

**ముందడుగు ప్రత్యేకం**



బ్లాక్ రైస్ ఒక అద్భుతమైన సమతుల్య ఆహార వనరు, ఇది ప్రోటీన్ మరియు ఫైబర్ యొక్క ఆరోగ్యకరమైన మిశ్రమాన్ని అందిస్తుంది. ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి. బ్లాక్ రైస్‌లో సమృద్ధిగా ఉండే ఒక సూక్ష్మపోషకం మాంగనీస్. మాంగనీస్ ఒక యాంటీఆక్సిడెంట్ మరియు మీ కణాలలో మైటోకాండ్రియాను ఆరోగ్యంగా ఉంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఆరోగ్యకరమైన జీవక్రియను నిర్వహించడంలో మాంగనీస్ పాత్ర పోషిస్తుందని తేలింది. కడుపు సమస్యలు ఉన్న వారికి బ్లాక్ రైస్ మంచి ఎంపిక. ఎందుకంటే ఇది గ్లూటెన్ ఫ్రీ. బ్లాక్ రైస్‌ని సాధారణంగా వాటర్ ఓట్స్ అంటారు. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలతో కూడిన సూపర్ ఫుడ్.

### మంచి పోషకాలు

బ్లాక్ రైస్ ఒక పోషక శక్తి మరియు అవసరమైన పోషకాలతో నిండి ఉంటుంది. నల్ల బియ్యం దాని ఊక పొరను కలిగి ఉంటుంది. ఇది ఫైబర్, ప్రోటీన్ మరియు B విటమిన్లు, మెగ్నీషియం మరియు ఫాస్పరస్‌తో సహా వివిధ విటమిన్లు మరియు ఖనిజాలతో సమృద్ధిగా ఉంటుంది. ఈ పోషక సాంద్రత మొత్తం ఆరోగ్యం మరియు జీవశక్తిని ప్రోత్సహించడానికి బ్లాక్ రైస్‌ని అద్భుతమైన ఎంపికగా చేస్తుంది.

### యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం

బ్లాక్ రైస్ యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది. ఇవి శరీరంలో హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను తటస్తం చేయడంలో సహాయపడే సమ్మేళనాలు. ఫ్లేవనాయిడ్లు మరియు ఆంథోసైనిన్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. గుండె జబ్బులు, మధుమేహం మరియు కొన్ని క్యాన్సర్లతో సహా దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి పాత్ర పోషిస్తాయి. మీ ఆహారంలో బ్లాక్ రైస్‌ని జోడించడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడికి వ్యతిరేకంగా మీ శరీరం యొక్క రక్షణకు మద్దతు ఇస్తుంది.

### గుండె ఆరోగ్యానికి చాలా మేలు

బ్లాక్ రైస్ తీసుకోవడం వల్ల ఆకట్టుకునే పోషకాల వల్ల గుండె ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు. బ్లాక్ రైస్‌లోని ఫైబర్ కంటెంట్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది మరియు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బ్లాక్ రైస్‌లోని పొటాషియం మరియు మెగ్నీషియం కంటెంట్ ఆరోగ్యకరమైన రక్తపోటు స్థాయిలకు మద్దతు ఇస్తుంది, గుండె ఆరోగ్యానికి మరింత దోహదం చేస్తుంది.

### పేగు ఆరోగ్యానికి మంచిది


బ్లాక్ రైస్‌లోని ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇది ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోటాను ప్రోత్సహిస్తుంది. ఫైబర్ ప్రీబయోటిక్‌గా పనిచేస్తుంది, ప్రయోజనకరమైన గట్ బ్యాక్టీరియాకు ఆహారం ఇస్తుంది మరియు వాటి పెరుగుదల మరియు వైవిధ్యానికి తోడ్పడుతుంది. సరైన జీర్ణక్రియ, పోషకాల శోషణ మరియు మొత్తం రోగనిరోధక పనితీరు కోసం ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోటా అవసరం.

### బరువు నియంత్రణ

అధిక ఫైబర్ కంటెంట్ మరియు తక్కువ కేలరీల సాంద్రతతో, బ్లాక్ రైస్ బరువు నిర్వహణకు సహాయపడుతుంది. ఇందులోని ఫైబర్ సంతృప్తిని పెంపొందించడంలో సహాయపడుతుంది, మిమ్మల్ని ఎక్కువసేపు పూర్తి అనుభూతిని కలిగిస్తుంది మరియు మొత్తం కేలరీల తీసుకోవడం తగ్గిస్తుంది. బ్లాక్ రైస్‌లోని కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు స్థిరమైన శక్తి స్థాయిలను అందిస్తాయి. రోజంతా సరైన శక్తి స్థాయిలకు మద్దతునిస్తూ ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి ఇది ఒక అద్భుతమైన ఎంపిక.

# టీవీ, ఓటీటీ వీక్షకులకు టాటా ప్లే మరియు అమెజాన్ ప్రైమ్‌ల భాగస్వామ్యం

**ముందడుగు హైదరాబాద్:**




ప్రముఖ కంటెంట్ పంపిణీ ప్లాట్‌ఫారమ్ టాటా ప్లే, అమెజాన్ ప్రైమ్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుకోవడం ద్వారా, టాటా ప్లే డిటిహెచ్, టాటా ప్లే బింజ్ వినియోగదారులకు ప్రైమ్ వీడియో బ్లాక్‌బస్టర్ కంటెంట్‌ని వీక్షించేందుకు అవకాశాన్ని కల్పిస్తోంది. టాటా ప్లే డీటీహెచ్ చందాదారులు ఇప్పుడు నెలకు రూ.199 నుంచి ప్రారంభమయ్యే మల్టీ ప్యాక్‌ల నుంచి తమకు కావలసిన కంటెంట్‌ను ఎంచుకోవచ్చు.

"ప్రైమ్ వీడియోలో, మా వినియోగదారులకు అత్యుత్తమ వినోదాన్ని అందించడమే మా లక్ష్యం. మనం ఎక్కువగా ఇష్టపడే సినిమాలు, సిరీస్‌ల విస్తృతంగా అందుబాటును నిర్ధారించేందుకు మా డిస్ట్రిబ్యూషన్‌ను బలోపేతం చేసే మార్గాలను నిరంతరం పరిశీలిస్తున్నాము" అని ప్రైమ్ వీడియో APAC & MENA ఉపాధ్యక్షుడు గౌరవ్ గాంధీ పేర్కొన్నారు. "టాటా ప్లేతో సహకారంతో డీటీహెచ్, డిజిటల్ వినియోగదారులకు ప్రైమ్ వీడియో పూర్తి ఎంపిక కంటెంట్‌తో పాటు ప్రైమ్ షాపింగ్, షిప్పింగ్ ప్రయోజనాలకు వేగవంతమైన యాక్సెస్‌ను అందిస్తుంది. భారతదేశంలోని వినియోగదారులకు ప్రీమియం వినోదాన్ని మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు టాటా ప్లేతో కలిసి పనిచేసేందుకు మేము వేచి చూస్తున్నాము" అని తెలిపారు.